

ప్రచారం చేస్తున్న శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, నాయకులు

## చిన్నయ్య గెలుపునకు కృషి

బెల్లంపల్లి, నవంబర్ 15 : బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గెలుపు కోసం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సైనికుల్లా కృషిచేస్తామని ఆ సంఘం శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 23వ వార్డు స్టేషన్‌రోడ్డు కాలనీలో మంగళవారం రాత్రి ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగరేణి కార్మికులకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలుకావాలంటే రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి సీఎం కావాలన్నారు. స్టేషన్‌రోడ్డు కాలనీ మరింత అభివృద్ధి చెందాలంటే దుర్గం చిన్నయ్యకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, సీపీఐ అనుబంధ సింగరేణి గుర్తింపు సంఘాలు వారి హయాంలో కార్మిక హక్కులను పోగొట్టాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

రెబ్బెన, నవంబర్ 15 : రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్ కార్మిక క్షేత్రంలో బుధవారం సాయంత్రం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కార్మికులపై ప్రేమతో అనేక హక్కులు అమలు చేశారన్నారు. బీఆర్ఎస్ సర్కారు మూడోసారి అధికారంలోకి రావాలంటే ప్రతీ ఒక్కరు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు మారిన వెంకటేశ్వర్లు, మాంతు సమ్మయ్య, మిట్టపల్లి కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, ఓరం కిరణ్, దాసరి బాబురావు, సత్యనారాయణ, కైత స్వామి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలకు సీఎఫ్ కార్యాలయం..

మంచిర్యాల ఏసీసీ, నవంబర్ 15 : కవ్వాల్ టైగర్ రిజర్వ్ సర్కిల్, కాళేశ్వరం జోన్ సీఎఫ్ అండ్ ఎఫ్‌డీపీటీ (ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మరియు ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ మంచిర్యాల) కార్యాలయాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎఫ్‌డీపీటీ సీఎఫ్ శాంతారామ్ తెలిపారు. బుధవారం సీఎఫ్ విలేకరులతో మాట్లాడారు. ఇంతకాలం బెల్లంపల్లిలో తాత్కాలికంగా కార్యాలయ నిర్వహణ పనులు నిర్వహించినట్లు, దీనిని పూర్తిగా మంచిర్యాల జిల్లా డీఎఫ్‌వో కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయం హమాలీవాడలో గల ఎఫ్‌డీవో కార్యాలయానికి మార్చనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడే డీఎఫ్‌వో కార్యాలయానికి సంబంధించి నూతన భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. నూతనంగా సీఎఫ్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లాలో అక్రమ కలపను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రత్యేకించి సిబ్బందిని నియమించినట్లు యన తెలిపారు.

## మెరుగైన వైద్యం అందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యాధికారి తుకారాం

దహెగాం, నవంబర్ 16 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యాధికారి తుకారాం వైద్య సిబ్బందికి సూచించారు. దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు, కోత్మీర్, గొర్రెగుట్ట గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాక్సినేషన్ నిల్వ చేసే విధానంతోపాటు రికార్డులను పరిశీలించారు. మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. కోత్మీర్, గొర్రెగుట్ట గ్రామాల్లో వ్యాక్సినేషన్ సెంటర్లలో వాక్సిన్ ఇచ్చే విధానంపై తెలుకున్నారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లీనిక్‌లో వైద్య సేవల వివరాలను వైద్యాధికారి స్పందనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వందశాతం ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వైద్యాధికారి స్పందన, సిబ్బంది ఉన్నారు.

# కేసీఆర్‌తోనే 'కారుణ్య' నియామకాలు

- డిపెండెంట్ పోగొట్టిన జాతీయ సంఘాలు
- కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిన నాయకులు
- ఆ పాపం వారిని ఇంకా వెంటాడుతున్నది
- నల్లసూర్యులకు అన్ని హక్కులు కల్పించిన సీఎం కేసీఆర్
- మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



ఆర్కే-5 గనిపై మాట్లాడుతున్న మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్, నవంబర్ 15 : సీఎం కేసీఆర్ కృషితోనే నేడు సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు వచ్చాయని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. జాతీయ కార్మిక సంఘాల పుణ్యమా అని డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టి, కార్మికులకు అన్యాయం చేశాయని మండిపడ్డారు. శ్రీరాంపూర్ ఆర్కే-5 గనిపై బుధవారం ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అవగాహనారాహిత్యంతో జాతీయ కార్మిక సంఘాలు చంద్రబాబు నాయుడు వద్ద చేసుకున్న ఒప్పందంతో కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు పోయాయని ఆరోపించారు. దాంతో సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గిందన్నారు. వారు చేసి పాపం ఇప్పటికీ జాతీయ సంఘాలకు తగులుతున్నదని పేర్కొన్నారు. అంతే కాకుండా జాతీయ కార్మిక సం ఘాల వల్ల యాజమాన్యం గోల్డెన్ హ్యాండ్ షేక్ ద్వారా బలవంతంగా కార్మికులను తొలగించినట్లు ఆరోపించారు. దాంతో 25 వేల మంది కార్మికులు అన్యాయం పాలయ్యారని తెలిపారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ గుర్తింపు కార్మిక సంఘాలుగా ఉన్నప్పుడు 3 వేల మంది కార్మికులను గైర్హాజరు పేరుతో డిస్మిస్ చేశారని ఆరోపించారు. అయినప్పటికీ కేంద్ర కార్మిక సంఘాలు కోర్టు ద్వారా అడ్డుకునే కుట్ర చేశారని చెప్పారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక హక్కులు కల్పించారని చెప్పారు. తెలంగాణ కోసం పోరాడిన కార్మికుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయ పరిధిలో కారుణ్య ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. తెలంగాణ ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సింగరేణి స్థలంలో నివాసం ఉంటున్న 3,500 మంది కార్మిక కుటుంబాలకు పట్టాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మల్లారెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, కాశీరావు, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, చంద్రయ్య, ఏరియా కార్యదర్శి తొంగల రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రౌతు సత్యనారాయణ, పిట్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, సత్యనారాయణ, అన్వేష్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఎన్నికల బరిలో 134 మంది

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వచ్చిన నామినేషన్లు 211
- తిరస్కరించినవి 42, ఉప సంహరించుకున్నవి 35..

| నియోజకవర్గం | నామినేషన్లు వేసిన అభ్యర్థులు | తిరస్కరించినవి | ఉపసంహరించుకున్నవి | బరిలో ఉన్నవారు |
|---|---|---|---|---|
| కాగజ్‌నగర్ | 21 | 05 | 04 | 12 |
| ఆసిఫాబాద్ | 15 | 03 | 01 | 11 |
| మంచిర్యాల | 21 | 03 | 04 | 14 |
| బెల్లంపల్లి | 25 | 09 | 03 | 13 |
| చెన్నూర్ | 30 | 06 | 10 | 14 |
| ఆదిలాబాద్ | 27 | 03 | 02 | 22 |
| బోథ్ | 14 | 02 | 02 | 10 |
| ఖానాపూర్ | 17 | 04 | 02 | 11 |
| ముథోల్ | 23 | 03 | 06 | 14 |
| నిర్మల్ | 18 | 04 | 01 | 13 |
| మొత్తం | 211 | 42 | 35 | 134 |

మంచిర్యాల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో 134 మంది అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. రికార్డు స్థాయిలో 211 మంది అభ్యర్థులు 330 నామినేషన్ సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అందజేశారు. అత్యధికంగా చెన్నూర్ నియోజకవర్గంలో 30 మంది నామినేషన్లు వేశారు. ఇందులో ఆరుగురి నామినేషన్లను తిరస్కరించగా, 10 మంది ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో 14 మంది బరిలో నిలవనున్నారు. అత్యధికంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో 22 మంది పోటీలో ఉన్నారు. చెన్నూర్‌తో పాటు ముథోల్, మంచిర్యాలలో 14 మంది ఎన్నికల బరిలో ఉండనున్నారు. ఈ నెల 13వ తేదీన 211 bgdr అభ్యర్థుల్లో 42 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించగా, 35 మంది ఈ రోజు నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు.

# ఆఖరి రోజు దండారీ హంగామా..

- వాయిద్యాలతో దద్దరిల్లిన పల్లెలు
- కొలబొడితో ముగిసిన వేడుకలు



కోలాటం ఆడుతున్న కొలాంగ్గురి దండారీ బృందం

కెరమెరి, నవంబర్ 15 : ఆదివాసీ గూడేల్లో ఆఖరి రోజు దండారీ వేడుకలు దుమ్మురేపాయి. కొలాంగ్గురి, సాకడ గ్రామాల్లో బుధవారం వేడుకల అనంతరం కొలబొడి నిర్వహించి, పండుగకు ముగింపు పలికారు. అంతకుముందు కోలాట, డప్పుల దరువుల మధ్య గుస్సాడీ నృత్యాలు, వివిధ వేషధారణలు కనువిందు చేశాయి. గోండి భాషలో యువకులు ప్రదర్శించిన హాస్యనాటికలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకలను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావ్, గ్రామ పటేల్ పెందోర్ దంబిరావ్, దండారీ యజమానులు, నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మహిళ వేషధారణలో నృత్యం చేస్తున్న యువకుడు